

కాటన్ పార్క్‌లో భారీ స్క్రీన్

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 12న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకార కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం వీక్షణకు కాటన్ పార్క్‌లో భారీ ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేసి, కుర్చీలు, టెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణ ప్రజలు, పుర ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని ఉదయం 9 గంటల నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించొచ్చని చెప్పారు.

పెనుమంట్ర: చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి ఒక్కో బస్సులో టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు బుధవారం ఉదయం బయల్దేరి వెళ్లనున్నారు. పెనుమంట్ర, ఆలమూరు, మార్టేరు ప్రాంతాల నుండి పలువురు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరుతున్నట్లు ఆయా పార్టీల నేతలు తెలిపారు.

మంత్రి పదవులపై ఉత్కంఠ..!



రాత్రి వరకూ విడుదల కాని జాబితా
అనేక మంది పేర్లు చక్కర్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

బుధవారం కొలువుదీరనున్న కొత్త మంత్రివర్గంలో చోటు దక్కేదెవరికోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ప్రమాణ స్వీకారం చేసే మంత్రుల జాబితాపై మంగళవారం రాత్రి వరకూ స్పష్టత రాలేదు. దీంతో జిల్లాలోని ఎంఎల్ఎల్లో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. వీరే మంత్రులు అంటూ సోషల్ మీడియాలో అనేక జాబితాలు చక్కర్లు కొడుతున్నప్పటికీ అధికారికంగా మాత్రం ప్రకటించని పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో టిడిపి నుంచి పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, బిజెపి నుంచి కామినేని శ్రీనివాస్, జనసేన నుంచి డిప్యూటీ స్పీకర్‌గా తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్లు జాబితాలో ఉన్నట్లు ఊహాగానాలు నడిచాయి. సీనియర్ నాయకులు పితాని సత్యనారాయణ, రఘురామకృష్ణంరాజుకు మంత్రి పదవులు ఇస్తారా.. లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. పితాని, నిమ్మల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ పితానికి మంత్రి పదవిపై రకరకాల ఊహాగానాలు విన్పిస్తున్నాయి. 2014, 2024 ఎన్నికల్లో పశ్చిమగోదావరి జిల్లా టిడిపికి కంచుకోటగా నిలిచింది. జిల్లాలోని అన్ని స్థానాలనూ టిడిపి కూటమినే గెలుచుకుంది. దీంతో జిల్లాకు మంత్రి పదవుల కేటాయింపులో ఎంతవరకూ ప్రాధాన్యత ఇస్తారనే చర్చ సాగుతోంది. కూటమిలోని మూడు పార్టీలకు ప్రాధాన్యత ఉంటుందా.. లేక టిడిపి ఎంఎల్ఎలకు మాత్రమే అవకాశం ఉంటుందా అనేది తేలాల్సి ఉంది. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుకు మాత్రం కచ్చితంగా మంత్రి పదవి ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మంత్రి పదవులపై సీనియర్ నాయకులంతా గంపెడాశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. మంగళవారం జరిగిన కూటమి ఎంఎల్ఎల సమావేశంలో చంద్రబాబును తమనేతగా ఎన్నుకోవడం, కూటమి నాయకులంతా ఆ వెంటనే గవర్నర్‌ను కలవడం చకచకా జరిగిపోయాయి. ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్‌డిఎ కూటమిని గవర్నర్ ఆహ్వానించడం సైతం జరిగింది. మంత్రుల జాబితాపై సైతం వెంటనే స్పష్టత వస్తుందని అంతా ఎదురుచూశారు. అయితే అలా జరగలేదు. మంగళవారం అర్ధరాత్రికి పేర్లు ప్రకటించే అవకాశం ఉందని, చంద్రబాబు స్వయంగా మంత్రులుగా ఎంపిక చేసిన వారికి ఫోన్లు చేస్తారని తెలిసింది. దీంతో తమ నాయకుని పేరు మంత్రి మండలి జాబితాలో ఉంటుందా, లేదా అని వారి అనుయాయులు తీవ్ర ఉత్కంఠకు గురవుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో తొలి జాబితాలో పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలో ముగ్గురికి మంత్రిపదవులు దక్కాయి. ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని, ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ రంగనాథరాజు, కొవ్వూరు ఎంఎల్ఎ తానేటి వనితకు మంత్రి పదవులు దక్కాయి. రెండోసారి మంత్రివర్గ విస్తరణలో ఆళ్ల నాని, రంగనాథరాజు మంత్రి పదవులు కోల్పోగా, తణుకు ఎంఎల్ఎ కారుమూరి నాగేశ్వరరావు, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ కొట్టు సత్యనారాయణకు మంత్రిపదవులు దక్కాయి. వైసిపి ఐదేళ్లపాలనలో పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో ముగ్గురు మంత్రులుగా కొనసాగారు. టిడిపి ప్రభుత్వంలో జిల్లాకు ఎన్ని మంత్రిపదవులు దక్కుతాయననే చర్చ సర్వత్రా నడుస్తోంది.

అలకలకు అవకాశం

సీనియర్ నాయకులంతా మంత్రి పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఒకవేళ మంత్రి పదవి రాకపోతే అలకలు, ఆగ్రహాలు వ్యక్తమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మంత్రి పదవి ఆశిస్తున్నారు. పితాని, బొమ్మిడి నాయకర్ వంటివారు ఆ జాబితాలో ఉన్నారు. ఒకవేళ పదవి దక్కకపోతే వీరంతా అలకబూనే అవకాశం కనిపిస్తోంది. ఇలాంటి వారితో చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడి బుజ్జగించే అవకాశం ఉందని చెబుతున్నారు. బుధవారం ఏం జరుగుతుందో వేచిచూడాలి.

ఉపాధి పనులు వంద రోజులు చూపాలి


సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉపాధి హామీ కార్మికులకు చట్టప్రకారం వంద రోజులు పని దినాలు చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. మండలంలోని పెన్నాడ గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని బలరాం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.అప్రియ్యతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఉపాది కూలీల సమస్యలు, పనులు జరుగుతున్న తీరును బలరాం అడిగి తెలుసుకున్నారు. అనంతరం బలరాం మాట్లాడుతూ ఉపాధి హామీ చట్ట ప్రకారం వంద రోజులు పని కల్పించాలని, అయితే క్షేత్రస్థాయిలో అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. మహిళలకైతే మూడు లేక నాలుగు వారాలు మాత్రమే పనులు కల్పిస్తున్నారన్నారు. భారీ యంత్రాలు వచ్చేయడంతో వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్సులు, పని ప్రదేశాల్లో ఎండ తీవ్రత బారిన పడకుండా టెంట్లు, చల్లని తాగునీరు, మజ్జిగ అందించాలన్నారు. అయితే ఇవేమీ అమలు కావడం లేదని కూలీలు వాపోయారు. ఉపాధి కూలీలకు పనిముట్లు అందించాలన్నారు. ఏదేని ప్రమాదం జరిగితే అత్యవసర చికిత్స నిమిత్తం ఏర్పాట్లు చేయాలని, ఇవేమీ జరగడం లేదని అన్నారు. చట్టప్రకారం ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలని, పని ప్రదేశాల్లో కల్పించాల్సిన సౌకర్యాలు కల్పించాలని బలరాం అధికారులను డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చకుండా బలోపేతం చేయాలని, 200 రోజులు పని, రోజుకు రూ.600 కనీస వేతనం ఇవ్వాలని బలరాం కోరారు.



ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

కొనసాగిన సిపిఎఫ్ కార్మికుల ఆందోళన

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - గణపవరం

సరిపల్లిలో సిపిఎఫ్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆ ఫ్యాక్టరీ కార్మికులు ఉద్యోగులు మంగళవారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.పెంటారావు, పచ్చిపులుసు గోవింద్ మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులను రోడ్డున పడేసేలా నష్టాల పేరుతో ఫ్యాక్టరీని మూసివేయడం తగదన్నారు. వెంటనే జిల్లా, స్థానిక అధికారులు స్పందించి ఫ్యాక్టరీని తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్ వై.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దండు రామలింగరాజు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇఎపి సెట్‌లో కృష్ణశ్రీకి 64వ ర్యాంకు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ పరిధిలోని కుక్కలవారితోటకు చెందిన గుబ్బల సాయికృష్ణశ్రీ ఎపి ఇఎపి సెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించింది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో అగ్రికల్చర్, ఫార్మశీ విభాగంలో 64వ ర్యాంకు సాధించింది. కృష్ణశ్రీ తండ్రి బాలచంద్రరావు నూజివీడులోని ట్రిబుల్ ఐటిలో అధ్యాపకునిగా పని చేస్తుండగా తల్లి భవాని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో పని చేస్తున్నారు.



జి.సాయికృష్ణశ్రీ, 64వ ర్యాంకు

తాడేపల్లిగూడెం: ఎపి ఇఎపి సెట్-2024 ఫలితాల్లో శశి కళాశాల విద్యార్థులు తాడేపల్లిగూడెం టౌన్ ప్రథమ స్థానం సాధించారని శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ 689వ ర్యాంకుతో కె.కార్తీక్ సాయిచైతన్య టౌన్ ప్రథమ స్థానంలో నిలవగా, జాత్విని 1329, టి.లక్ష్మీ సంజన 1335, అంజూష 1413, ఎం.మేధా 1452, బి.అరవింద్ 1499, ఎం.మొహిద్దీన్ 1234, రెండు వేలలోపు ఏడుగురు, మూడు వేలలోపు 12, పది వేలలోపు ర్యాంకులు 32 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు.



కార్తిక్ సాయి చైతన్య, 689వ ర్యాంకు

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో డి.పూజిత తులసి 2626వ ర్యాంక్, జి.విశ్వకీర్తి 4470, పది వేలలోపు ఐదుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ఈ విజయాన్ని అందించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి గోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ క్రాంతి సుధ అభినందించారు.

నరసాపురం : ఎపి ఇఎపిసెట్ 2024 ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుతంగా రాణించారని సూర్య కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకి భావన 2833 ర్యాంకు, నాగిడి మోహన్ సాయి 5659 ర్యాంకు, పితాని విష్ణుమూర్తి 6091 ర్యాంకు సాధించారని తెలిపారు. అలాగే మరికొంత మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సొంతం చేసుకుని నరసాపురం పట్టణానికి మంచి పేరు తెచ్చారన్నారు. వీరు మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఘంటసాల సూర్యనారాయణ, అకాడమిక్ అడ్వయిజర్ బోయి రామచంద్రారెడ్డి, సీనియర్ అధ్యాపకులు ఎఆర్ఎస్.కుమార్, డాక్టర్ ఫాజల్, డాక్టర్ జానకీరామ్, గ్రంధి వెంకటేశ్వరరావు, కడలి త్రిమూర్తులు తదితరులు అభినించారు.



మణికంఠ,247వ ర్యాంకు

ఆచంట: ఎపిఇఎపి సెట్‌లో మండలంలోని కరుగోరుమిల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ ముత్యాల నాగ శేషగిరి అప్పారావు కుమారుడు ముత్యాల రామ సత్య వెంకటషణ్ముఖశ్రీ మణికంఠ ఇంజినీరింగ్ విభాగంలో 247వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పలువురు అభినందించారు.

జెఇఇ అడ్వాన్స్‌లో రూట్స్ పూర్వ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు

ఇటీవల విడుదలైన జెఇఇ అడ్వాన్స్ పరీక్షా ఫలితాల్లో స్థానిక రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్ పూర్వ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి జాతీయస్థాయిలో విజయకేతనం ఎగురవేశారని ఆ స్కూల్ ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకు రూట్స్ స్కూల్ ఫుల్‌టైమ్ ఐఐటి ఫౌండేషన్ ప్రోగ్రామ్‌లో చదివిన పూర్వ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో కెఎస్‌టి.అనురూప్‌రెడ్డి 62వ ర్యాంకు, బిహెచ్‌బికె.ప్రవీణ్‌వర్మ 1413వ ర్యాంకు, ఎం.తేజ 1557వ ర్యాంకు, వి.లక్ష్మీఅంజన 2141వ ర్యాంకు, పి.రూపేష్‌వెంకట్ 2209వ ర్యాంకు, డి.తేజ అభినయ్ 2230వ ర్యాంకు, ఎం.జెఫాన్‌సామ్ 2674వ ర్యాంకు, వై.కార్తీక్ 2704వ ర్యాంకు, బి.అభిరామ్ 4031వ ర్యాంకు, ఎమ్‌డి.ఆసిఫ్ 6723వ ర్యాంకు సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు రూట్స్ పాఠశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్‌కె.త్రిపాఠి, బి.విద్యాకాంత్, ఎన్.సుధాకరవర్మ, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న రూట్స్ స్కూల్ డైరెక్టర్లు

తేనెటీగల దాడిలో వెటర్నరీ అసిస్టెంట్లకు గాయాలు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని అయోధ్యలంక గ్రామంలో ఇద్దరు వెటర్నరీ అసిస్టెంట్లపై తేనెటీగలు దాడి చేయడంతో గాయాలపాలయ్యారు. అయోధ్యలంక వెటర్నరీ అసిస్టెంట్ నజీర్‌బాబు, పెదమల్లం వెటర్నరీ అసిస్టెంట్ శిరీషా మంగళవారం సాయంత్రం అయోధ్యలంక పంచాయతీ పరిధి రావిలంకలో పశువులకు టీకాలు వేసే నిమిత్తం వెళ్లారు. అయితే వీరిపై తేనేటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో గాయాలయ్యాయి. వీరిని స్థానికులు హుటాహుటీన పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యాధికారులు చికిత్స అందించి వారికి ప్రమాదం లేదని చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



చికిత్స పొందుతున్న వెటర్నరీ అసిస్టెంట్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు సూచించారు. లంకలకోడేరు పిహెచ్‌సిలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మహేశ్వరరావు పాల్గొని సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎక్కువ ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణులను తరచూ ఫాలోఅప్ చేసి కొత్తగా వివాహం జరిగిన వారికి కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులను తెలియజేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పిహెచ్‌సిలో లేబర్ రూమ్, ఇతర రూములను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మలేరియా మాసోత్సవం సందర్భంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి కె.రాజ్‌కుమార్, టిబి సూపర్‌వైజర్ ఉదయ్ చందర్‌తో పాటు డాక్టర్ ప్రతాప్‌కుమార్, డాక్టర్ నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

పదో తరగతిలో అధిక ఉత్తీర్ణతే లక్ష్యం

డిఇఒ ఎస్.అబ్రహాం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణతా శాతం సాధనే లక్ష్యంగా ఈ సంవత్సరం పక్కా ప్రణాళికతో ముందుకు సాగనున్నట్లు డిఇఒ ఎస్.అబ్రహం తెలిపారు. ఈ నెల 13 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయనను ప్రజాశక్తి పలుకరించింది. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లా ఉత్తీర్ణతాశాతం 8018గా ఉందని, రాష్ట్రస్థాయిలో దిగువ స్థానంలో ఉన్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఉత్తీర్ణతా శాతం పెంచేలా విద్యా సంవత్సరం ఆరంభం నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబర్చనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1818 పాఠశాలలు 13న తెరుచుకోనున్నాయని, లక్షా 56 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యశిస్తున్నారని తెలిపారు. పదో తరగతి విద్యార్థులతోపాటు ఇతర తరగతుల్లోని విద్యార్థుల స్థాయి పెంచేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో కలిసి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం స్టూడెంట్ కిట్ పేరుతో విద్యార్థులకు అందించే స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్సులు, టై, బెల్టు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, మరో మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో కిట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. స్కూళ్లు తెరిచిన రెండు, మూడు రోజుల్లో విద్యార్థులకు ఈ కిట్లను విద్యార్థులకు పంపిణీ పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, పాఠశాలలు ప్రారంభమైన నాలుగైదు రోజుల వరకు అడ్మిషన్లు కొనసాగుతాయని తెలిపారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ పేరుతో ఆర్‌టిసి ఉద్యోగులపై విధించిన అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక ఆర్‌టిసి గ్యారేజీ వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని సమస్యలు ప్రస్తావిస్తే అది ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు. సుందరయ్య ఏ పార్టీకీ ఎన్నికల్లో ప్రచారం చేయలేదని, పోటీ చేసిన అభ్యర్థులకు ఓటు వేయాలని కోరలేదని, అయితే యాజమాన్యం అక్రమంగా, అన్యాయంగా సస్పెన్షన్ చేసిందని విమర్శించారు. ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలపై నికరంగా, నిజాయతీగా పని చేస్తున్న సుందరయ్యను దురుద్దేశపూర్వకంగా యాజమాన్యం సస్పెండ్ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్‌ను అడ్డు పెట్టుకుని గత ప్రభుత్వ మెప్పు కోసం చేసిన అక్రమ సస్పెన్షన్ తప్ప మరొకటి కాదన్నారు. సుందరయ్య అక్రమ సస్పెన్షన్ వెంటనే రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా చలో ఏలూరుకు పిలుపునిస్తామని అన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్ఎన్.రమేష్ మాట్లాడుతూ ఏలూరు డిపిటిఒ ఆర్‌టిసి ఉద్యోగులపై, నాయకులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని, ఆయన చేయిస్తున్న అక్రమ సస్పెన్షన్లు ఆపాలని అన్నారు. ఉద్యోగుల హక్కులను కాపాడాల్సిన జిల్లా అధికారి ఇలా వ్యవహరించడం తగదని హితవు పలికారు. ఆర్‌టిసిలో అక్రమ సస్పెన్షన్లపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర మాట్లాడుతూ జిల్లాలో చిన్న చిన్న కారణాలకు సైతం ఉద్యోగులను యథేచ్ఛగా సస్పెన్షన్లు, రిమూవల్స్ చేస్తున్నారన్నారు. అప్పీళ్ల పరిష్కారంలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్ల ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు డిపిటిఒ ఆర్‌టిసి ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని కోరారు. ఈ నిరసనలో సిఐటియు నాయకులు బి.సోమయ్య, గోపీ, రైతుసంఘం నాయకులు కె.శ్రీనివాస్, అంగన్వాడీ నాయకులు కె.విజయలక్ష్మి, అరుణకుమారి, వివిధ డిపోల నుండి ఆర్‌టిసి నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నేతలు



ఇసుక ర్యాంపులను పరిశీలించిన అధికారులు

ఇసుక ర్యాంపుల పరిశీలన

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని సిద్ధాంతం, నడిపూడి ఇసుక ర్యాంపులను జిల్లా గనుల శాఖ అధికారి జి.జయప్రకాష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గనులు జల వనరుల శాఖ కాలుష్యం నియంత్రణ శాఖ మండలి రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు


రోగులకు మందులు అందజేస్తున్న కంపెనీ డైరెక్టర్ జాస్తి మహినర్

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

సీసలిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని మాజీ సర్పంచి కట్రేడ్డి శ్రీనివాసరావు అన్నారు. సీసలి హైస్కూల్లో జయలక్ష్మి రొయ్యల కంపెనీ, భీమవరం ఇంపీరియల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం వల్ల సకాలంలో వ్యాధి నిర్ధారణ జరుగుతుందన్నారు. తద్వారా సకాలంలో చికిత్స పొందొచ్చన్నారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి రొయ్యల కంపెనీ ఎమ్‌డి కుదరవల్లి రమేష్‌బాబు, కంపెనీ డైరెక్టర్ జాస్తి మహినర్, కంపెనీ మేనేజర్ గుప్త వెంకట రామ్మోహన్‌రావు, నూకలు భోగేంద్రబాబు, పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మంగళవారం తెలిపారు. కాలేజీలో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలూ అందుతాయన్నారు. అన్ని సబ్జెక్టులకూ సంబంధించిన లెక్చరర్లు పూర్తిస్థాయిలో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలూ ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేర్పించాలని కోరారు.

నిబద్ధతతో పనిచేయడమే నా తండ్రి సిద్ధాంతం

జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏ పని అయినా నిబద్ధతతో చేసిన తరువాతే దాని ఫలితం కోసం ఎదురు చూడాలన్నదే తన తండ్రి ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సిద్ధాంతమని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం పడమర విప్పర్రులో సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు ఏ ప్రభుత్వం మంజూరు చేసిందనేది చూడకుండా ప్రజలకు మంచి జరుగుతుందా లేదా అనేది తమ ప్రభుత్వ సిద్ధాంతమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం:కూటమి విజయం అందరి విజయమని, ప్రజలంతా ఎన్నో ఆశలతో కూటమిని గెలిపించిన ఆనందాన్ని నియోజకవర్గ అభివృద్ధి పథంలో రెట్టింపు చేస్తామని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలో విజయోత్సవ ర్యాలీ చేస్తూ ప్రతి ఇంటికి కరపత్రం, స్వీట్ ప్యాకెట్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తన తండ్రి విజయాన్ని అందరికీ స్వీట్లతో పంచుకుంటున్నానని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత తీపి అందించే విధంగా కూటమి పాలన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి శేఖర్ (పండు), మట్ట రాంబాబు, రేవళ్ల సోమరాజు, మజ్జ అప్పారావు, ఆర్మాల అంజి, బలగం మాచారయ్య, వీర్ల తాతారావు, వీర్ల గోవిందరాజు, గిద్ద శ్రీను, తాడిపర్తి రమణారావు, కడగట్ల శ్రీను, అత్తిలి బాబి పాల్గొన్నారు.

హాస్టళ్లలో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలి

ప్రజాశక్తి - నరసాపురం

సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఈ సంవత్సరం ఎక్కువ మంది విద్యార్థులు ప్రవేశాలు జరిగేలా చూడాలని సహాయ సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కె.బాలు సాధన తెలిపారు. మంగళవారం స్థానిక వైఎన్ కళాశాలలో కళాశాల, సామాజిక సేవా విభాగ సంయుక్త ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ సచివాలయ సహాయకులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రవేశాల కోసం ప్రతి గ్రామానికీ వెళ్లి వసతి గృహాల్లో ఏర్పాట్లపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సాంఘిక సంక్షేమ సచివాలయ సహాయకులకు ఆదేశించారు. అలాగే నూరు శాతం అడ్మిషన్లు చేయాలని, వసతి గృహాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టి విద్యార్థులకు మరిన్ని అవసరాలను తీర్చాలన్నారు. రాబోయే కాలంలో విద్యార్థులే పబ్లిసిటీ ఇస్తారని, తద్వారా మరిన్ని ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలను కల్పించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించినందుకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సి.సత్యనారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ జిఎస్‌విఎస్.సాయిబాబా, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకట రత్నం, కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ, కళాశాల కార్యాలయ పర్యవేక్షకులు తోట ఏడుకొండలు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న సిబ్బంది

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - కాళ్ల

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చని కాళ్ల పిహెచ్‌సి వైద్యాధికారి సరాబు సునీల్ తెలిపారు. మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సరాబు సునీల్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. లార్వా స్థాయిలో నిర్మూలించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గుంతల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల వ్యాప్తిని అరికట్టడానికి కిరోసిన్, క్రూడ్ ఆయిల్‌ను చల్లడం ద్వారా దోమలను నివారించవచ్చని చెప్పారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ విజయలక్ష్మి, పిహెచ్‌ఎన్ చందిరాణి, ఎంపిహెచ్‌ఇఒ పాల్సన్, హెచ్‌వి సుబ్బలక్ష్మి, పరంజ్యోతి, ఎఎన్ఎంలు ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


పశువులకు టీకా వేస్తున్న డాక్టర్

పశువులకు టీకాలు

మొగల్తూరు:రైతులు పశువులకు గొంతువాపు నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి జి.నీలిమ సూచించారు. మండలంలోని కెపి.పాలెంలో మంగళవారం పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలిమ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుందని తెలిపారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా పశువులకు టీకాలు వేయించాలన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కాలుష్యమయం వెంకయ్య కాలువ..!

చెత్తాచెదారం, చేపల వ్యర్థాలతో దుర్గంధం

16 గ్రామాలకు ఈ కాలువ నీరే ఆధారం

రోగాల బారిన ప్రజలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆకివీడు

వెంకయ్య కాలువ చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయింది. దీనికితోడు కాలువ గట్టు పొడవునా మొత్తం దుర్గంధపూరితంగా తయారైంది. ఇటీవల కాలువలోకి చేపలు, రొయ్యల చెరువుల నీటిని వదిలేయడంతో నీరు దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కాల్వలకు గోదావరి నీళ్లు వదిలారు. కాలువను శుభ్రం చేయకుండా నీరు వదలడం వల్ల రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, ఆ నీటిని తాగే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వెంకయ్య కాలువ పెదకాపవరం వద్ద ప్రారంభమై ఆకివీడు మీదుగా అయిభీమవరం, చెరుకుమిల్లి, కాళ్ల మండలం ఏలూరుపాడు వరకూ చేరుతోంది. మండలంలో 16 గ్రామాల ప్రజలు పూర్తిగా ఈ నీటిపైనే ఆధారపడి ఉన్నారు. ఈ కాలువ నీటినే ఆ గ్రామస్తులు సాగుకు, తాగడానికి వినియోగిస్తారు. గతంలో వేసవికాలంలో కాలువలు పూర్తిగా ఎండిపోయేవి. ఆ సమయంలో మట్టి పూర్తిగా ఎండిపోయి మట్టిలోని సూక్ష్మక్రిములు చనిపోయేవి. తిరిగి వర్షాలు పడగానే కొత్త నీరు వదిలేవారు. కొత్తనీరు వల్ల ఆరోగ్యాలు కొద్దిగా తేడా వచ్చినా పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. అయితే ప్రస్తుతం చేపలు, రొయ్యల చెరువుల నీటితో పాటు, చెత్తా చెదారాలు కాలువలో చేరుతున్నాయి. దీనికితోడు కాలువ గట్టున ఉన్న నివాసాలన్నీ మల, మూత్ర విసర్జనకు సంబంధించి నుయ్యిలు కాలువకు కొద్ది దూరంలోనే తవ్వారు. పేరుకు దూరంగా ఉన్నా ఆ వ్యర్థాలు కాలువలో కలుస్తున్నాయి. ఈ నీరే మొత్తం 16 గ్రామాల ప్రజలు తాగుతుండడంతో వారు రోగాలబారిన పడుతున్నారు. వెంకయ్యకాలువ నీరు తాగితే పక్షవాతం, కేన్సర్లు వస్తాయని గతంలో కేంద్ర జల వనరుల శాఖ అధికారులు, సాంకేతిక నిపుణులు శాస్త్రీయ పరిశోధనలతో తేల్చి చెప్పారు. అయినా అధికారుల తీరులో మార్పు లేదు. ప్రజా ప్రతినిధులు సమస్యను పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కొత్తనీరు వదిలే ముందు కాలువను ఒకసారి ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.


చేపలు, రొయ్యల చెరువుల నుండి విడుదలైన నీటితో అధ్వానంగా తయారైన వెంకయ్య కాలువ

బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - పెంటపాడు

కొత్త ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాలని రైతు సంఘం నాయకులు చిర్ల పుల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులుకండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని మీనవల్లూరు, కోరుమిల్లి, బి.కొండేపాడు గ్రామాల్లో వారు పర్యటించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకుని మాట్లాడారు. మూడోసారి అధికారం చేపట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలని కుటుంబానికి రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ చట్టం కూలీలకు వరం వంటిదన్నారు. అలాంటి చట్టాన్ని ప్రకడ్బందీగా అమలు చేయడానికి ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు మాట్లాడారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస, రైతు సంఘం నేతలు

లక్ష్మమ్మ పోరాట స్ఫూర్తి పలువురికి ఆదర్శం

ప్రజాశక్తి - యలమంచిలి

1977 - 80 మధ్యకాలంలో చించినాడ గ్రామంలో భూస్వాములకు, పేదలకు మధ్య జరిగిన మహా పోరాటంలో లక్ష్మమ్మ చూపిన పోరాటపటిమ పలువురికి ఆదర్శమని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అన్నారు. చించినాడ పోరాట నాయకురాలు లక్ష్మమ్మ ద్వితీయ వర్ధంతి సభ మంగళవారం లక్ష్మమ్మ స్వగృహం వద్ద నిర్వహించారు. ఈ సభకు సిపిఎం నాయకులు వల్ల ఏడుకొండల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సభలో బాలరాజు మాట్లాడుతూ చించినాడ మహాపోరాటం సందర్భంగా అప్పటి కాంగ్రెస్ నాయకత్వంలో గ్రామంలోని సిపిఎం నాయకులు, పోరాట నాయకులందరినీ జైల్లో నిర్బంధించి భయభ్రాంతులకు గురిచేసినా కూడా ఆనాడు మహిళలు సాగించిన పోరాటం ఎంతో ఆదర్శనీయమన్నారు. ఆ పోరాటంలో లక్ష్మమ్మ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మమ్మ కుమారులు విప్పర్తి కన్నందాసు, విప్పర్తి నాగేశ్వరరావు, లక్ష్మమ్మ మనవలు విప్పర్తి అవినాష్ (నన్ని), విప్పర్తి నాని, సిపిఎం నాయకులు మొమ్మిడివరపు ఆంజనేయులు, గోగినేని శ్రీనివాస్, తెన్నేటి స్టాలిన్, తెన్నేటి శివాజీ, పల్లేరు వెంకటస్వామి పాల్గొన్నారు.


లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

వైఎన్‌లో ముగిసిన వర్క్ షాప్

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక వైఎన్ కళాశాలలో కళాశాల, ఐక్యూ ఎసి సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు 'బోధన, పరిశోధనా పద్ధతి' నిర్వహించిన వర్క్ షాపు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ సైంటిస్ట్, కళాశాల రీసెర్చ్ ఎడ్వయిజర్ ఆర్‌వి సుబ్బారావు విచ్చేసి 'బోధనా పద్ధతుల్లో నూతన పోకడలు' అనే అంశంపై మాట్లాడారు. ఈ శతాబ్దపు విద్యావేత్తలు నేటి ప్రపంచంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి వినూత్న విధానాలు తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల ఐక్యూ స్థాయిని పెంచి, వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. కళాశాల పీజీ అసిస్టెంట్ డైరెక్టర్, మేనేజ్ మెంట్ స్టడీస్ హెడ్ రంగినీడి పార్థసారథి మాట్లాడుతూ పరిశోధనా పద్ధతి అనేది పరిశోధకుడు తమ పరిశోధనను ఎలా నిర్వహించాలనుకుంటున్నారో వివరించే మార్గమన్నారు. ఐక్యూ ఎసి కో ఆర్డినేటర్ ఎం.మాణిక్యం మాట్లాడుతూ 'నాక్ విధి, విధానాలను, రాబోయే రోజుల్లో నాక్ ప్రశ్నావళి మార్పులను దృష్టిలో ఉంచుకుని, ఇప్పటి నుంచి మనం దానికి తగినట్లుగా వివరాలను పొందుపర్చుకుంటూ ఫైళ్లను తయారు చేసుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ పొన్నపల్లి రామారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జిఎస్‌విఎస్.సాయిబాబా, పీజీ సెంటర్ డైరెక్టర్ నిమ్మల చింతారావు, కళాశాల డీన్ గంధం రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆక్వాను వ్యవసాయ రంగంగా గుర్తించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఉండి

ఆక్వాను వ్యవసాయ రంగంగా గుర్తించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆక్వా రైతు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధనికొండ శ్రీనివాస్ మాట్లాడారు. ఆక్వా రైతులకు గత వైసిపి ప్రభుత్వం యూనిట్ విద్యుత్ 1.50 పైసలకు ఇస్తానని చెప్పి నిండా ముంచేసిందని విమర్శించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఆక్వా రైతులకు మేలైన ఫీడ్, సీడ్ అందించాలన్నారు. ఆక్వా రైతులకు అంత గిట్టుబాటు ధర లేక ట్రేడర్ల చేతిలో మోసపోతున్నారని వాపోయారు. రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతున్న ఫీడ్ ధరలను అదుపులోకి తీసుకు రావడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. సన్న, చిన్నకారు రైతులు గిట్టుబాటు ధర లేక పెరిగిపోతున్న ఫీడ్ ధరలతో ఆక్వారంగానికి దూరమైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా రంగం వల్లే విదేశీ మారకద్రవ్యాన్ని విపరీతంగా ఆర్జిస్తున్నారన్నారు. అటువంటి రంగాన్ని నిర్వీర్యం చేయకుండా వ్యవసాయ రంగంగా గుర్తించి ఆక్వారైతులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో పడమట ఆంజనేయులు, బొర్రా త్రిమూర్తులు, ఎన్.శ్రీనివాసరావు, ఎన్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న సిబ్బంది

జంతు వధ నేరమంటూ ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జంతువుల వధ, జంతువుల అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధకశాఖ, జిల్లా జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జంతువధ నిషేధించాలి అంటూ పట్టణంలో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ జంతువులను ప్రేమించడం మానవ ధర్మమన్నారు. చెరుకువాడ రంగసాయి గోవధ నిషేధ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - పోడూరు

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత టిడిపి, జనసేన కార్యకర్తలు వైసిపిలోని దళితులు, గిరిజనులపై విచక్షణ రహితంగా దాడులు చేస్తున్నారని, దాడులను వెంటనే అరికట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్‌సి కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద ప్రకాశ్ తెలిపారు. మంగళవారం పోడూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఇన్ని దాడులు జరుగుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా, దాడులు ఆపకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని తెలిపారు. వెంటనే జాతీయ ఎస్‌సి కమిషన్ రాష్ట్రంలో పర్యటించి బాధితులకు న్యాయం చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎపిటిఎఫ్ తణుకు జోన్ సమావేశం జోనల్ కన్వీనర్ వి.రామ్మోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ 117 జిఒను రద్దు చేసి పాఠశాలల విలీన ప్రక్రియను రద్దు చేయాలని, 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని, మెగా డిఎస్‌సి నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించాలని కోరారు. సమావేశంలో నేతలు పివి.పెద్దిరాజు, ఎ.వీరభద్రరావు, ఎన్.జయరాజు పాల్గొన్నారు.

గూడెంలో అన్నాక్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నా క్యాంటీన్‌ను మంగళవారం ఆ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ప్రారంభించారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా స్థానిక శేషమహల్ రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి, సైకిల్‌కు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. గతంలో ఏ ఎన్నికల్లో లేని మెజార్టీ కూటమి అభ్యర్థులకు లభించిందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తాలూకా ఆఫీస్ సెంటర్లో అన్నా క్యాంటీన్ వద్ద టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ కుమారుడు ముత్యాల ప్రఫుల్ కుమార్ భారతి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారి ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, గంధం సతీష్, దాట్ల శివరామరాజు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకటావు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న నేతలు

13 నుంచి పాఠశాలలు ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 13వ తేదీన పాఠశాలలు పున్హప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని దాదాపు అన్ని పాఠశాలలూ నూతన విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముస్తాబవుతున్నాయి. మండలంలో 35 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలలతోపాటు, నెగ్గిపూడిలో మహాత్మా బాపూజీరావు పూలే, ఎపి బిసి బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలు నడుస్తున్నాయి. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మార్టేరు, నెగ్గిపూడి, పెనుమంట్ర, ఆలమూరు, జుత్తిగ, మాముడూరు, పొలమూరు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం నుండి నెగ్గిపూడి (మార్టేరు) శ్రీ వేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ కో ఎడ్యుకేషన్ ప్రథమ సంవత్సరం తరగతుల ప్రారంభం కోసం అడ్మిషన్లు జరగడం విశేషం. మార్టేరు, నెగ్గిపూడి, ఆలమూరు, పెనుమంట్ర, పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సైతం 500లకుపైగా మార్కులు తెచ్చుకొని ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రతిభ చాటుతున్నారు. ప్రభుత్వం తరపున ఈ విద్యా సంవత్సరం ఆరంభం నాటికి యూనిఫామ్ మినహా, పాఠ్యపుస్తకాలు, షూలు, టైలు మొదటి విడతగా వచ్చాయని ఎంఇఒలు యద్దనపూడి లక్ష్మీనారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు.

జారిపడి మంత్రి వర్మ తండ్రికి గాయాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తండ్రి సూర్యనారాయణరాజు తన నివాసంలో జారిపడి స్వల్ప గాయాల పాలయ్యారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. ఈ విషయం తెలియగానే శ్రీనివాస్ వర్మ హుటాహుటీన ఢిల్లీ నుంచి భీమవరం చేరుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రిని పరామర్శించారు. వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రమంత్రి పదవి స్వీకరించిన తర్వాత శ్రీనివాస్ వర్మ తొలిసారి భీమవరం రావడంతో బిజెపి, టిడిపి నాయకులు పెద్దఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, బిజెపి నేత పాకా వెంకట సత్యనారాయణ, టిడిపి నేతలు కోళ్ల నాగేశ్వరరావు వర్మను కలిసిన వారిలో ఉన్నారు.

పలుచోట్ల భారీ స్క్రీన్ల ఏర్పాటు

పెనుమంట్ర:ఈ నెల 12న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం, మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఎల్‌సిడి ద్వారా మండలంలోని మార్టేరు జంక్షన్‌లో ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ పి.పద్మజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించు కోవాలని తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలకొల్లు : సిఎంగా బుధవారం చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో మున్సిపాల్టీ వారు భారీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయ సారధి తెలిపారు. ప్రధాన మంత్రితో పాటు పలువురు సిఎంలు హాజరవుతున్న సందర్భంగా సామాన్య ప్రజలు వీక్షించేందుకు ఈ భారీ స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాన్య ప్రజలు, యాత్రికులు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన కోరారు. పాలకొల్లు రూరల్ ప్రాంతంలో కూడా భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసినట్లు పాలకొల్లు ఎంపిడిఒ అనుపమ తెలిపారు.

వృద్ధురాలికి అమ్మ ఛారిటబుల్ ట్రస్టు అంత్యక్రియలు

పాలకొల్లు :పాలకొల్లు పెద్దగోపురం సమీపంలో భిక్షాటన చేసుకునే ఓ వృద్ధురాలు సోమవారం రాత్రి మృతి చెందింది. దాతల సహకారంతో మంగళవారం ఆ వృద్ధురాలికి అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ట్రష్ట్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, సతీష్, యశ్వంత్, సిద్ధిక్, చందు, నారాయణ, అంబటి సాయి తేజ ఉన్నారు.

CHANGE OF NAME

I, **MOHAMMAD JILANI** S/o. Mohammad Mastan Vali, D.No. 11-1-70, Near Church, Darga Center, Narasapur-534275, W.G.Dt. A.P. I have changed my name from **MAHAMMAD JILANI** (Old name) to **MOHAMMAD JILANI** (New name) hence forth I am being called **MOHAMMAD JILANI** S/o. Mohammad Mastan Vali, for all purposes.

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ)
రి.నెం. ABC-CS/006/2015
H.O. : ABCCS Endowments Commissionerate Complex, Gollapudi, Vijayawada-521 225. Phone: 0866-6650307
B.O. : ABCCS , D.No.23B-5-96/1, R.R.Peta, ELURU-534 002, Ph: 08812-249787

ఈ ప్రకటనలోని వారి తాలూకు దిగువ ఉదహరించిన స్థిరాస్తిని సొసైటీ నందు తనఖా పెట్టి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖాపై సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజుల లోపుగా లిఖితపూర్వకముగా అభ్యంతరములను రిజిస్టరు పోస్టు విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంటు ద్వారా మా సొసైటీకి తెలియపర్చవలసినదిగా కోరుతున్నాము.

Sl.No.	Applicant Name & Present Residence Address	Description of the Property
1	i) Sri. Vennelakanti Ramakrishna, S/o. Vennelakanti Sri Rama Rao, G.L. No. 55989 H.No. 3-154/1, High School Road, Revenue Ward No. 19, Eluru - 534003 Cell: 9248528471 / 9553294537	The property which is an extent of 110.0 Sq.Yds of house site along with RCC roofed ground floor residential building therein, in R.S. No. 44, Block No.7, Door No. 4349/3-154/1, Assessment No. 1075057618, Near Ramalayam, High School Road, Sanivarapu peta Village Panchayat, present Eluru Municipal Corporation, Erstwhile West Godavari District, Present Eluru Dist. A.P. 534003 **Value Rs. 25.40 Lakh**

Eluru
Dt.11-06-2024

NORI LAKSHMI NARASIMHAM
Branch Manager
Cell: 9281029465, 6300634609